క్లుప్తంగా

పోరాట యోధుడు ధర్మభిక్షం



ధర్మభిక్షం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: మాజీ ఎంపీ, కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది రాములు గౌడ్ మాట్లాడుతూ ఆజన్మాంతం తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన మహానేత భిక్షం అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడిగా, కార్మిక సంఘాల నాయకుడిగా, కమ్యూనిస్టు నేతగా మరెన్నో ఉద్యమాలు చేసి, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఆయన విగ్రహం పెట్టాలన్నారు. ధర్మభిక్షం ఆశయ సాధనకు యువతరం కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శేఖర్‌గౌడ్, మహేశ్‌గౌడ్, యాదయ్య, నిరంజన్, మాణిక్యంగౌడ్, పర్వతాలు, కిషోర్‌లు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు సన్మానం



లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్‌ను శివాలయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం శివాలయంలో లక్ష్మణ్, శోభ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవలో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటేశ్, రమేశ్, భాస్కర్, శివలింగం, సుమన్, నవీన్, రాఘవేందర్, చెర్కు శివ, కండెసాయి, మురళీధర్, మల్లేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు టాలెంట్ టెస్టు



ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న రాము

ఆమనగల్లు: పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో శనివారం తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ప్రశ్న పత్రాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం రాము మాట్లాడుతూ.. ఈ పరీక్ష విద్యార్థుల ప్రతిభకు ఎంతగానో తోడ్పాటునందిస్తుందని తెలిపారు. ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సుదర్శన్, వివిధ సంఘాల, యువజన సంఘాల నాయకులు శివశంకర్, శంకర్, ఏపీ.శర్మ, శివలింగం, శ్రీరామ్, నరేశ్, శ్రీశైలం, రమేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

ఏసీపీ కేవీపీ రాజు



దివ్యాంగులతో ముచ్చటిస్తున్న ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. ఏసీపీగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఏసీపీ అందజేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలు ఎంతో ప్రేమానురాగాలతో ఉంటారని, ఇక్కడ పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, వెంకటేశ్, ఎండీ సలీం, బాలరాజ్, నరసింహగౌడ్, పాండు, లింగమయ్యలు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంపై నీలినీడలు

హైకోర్టు ఆదేశించినా ఫలితం శూన్యం
- మధ్యలో నిలిచిన పనులు
- విద్యార్థులకు తప్పని తిప్పలు



అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం

తుర్కయంజాల్: ప్రభుత్వ పాఠశాల భూమిని కాపాడాలని ఉపాధ్యాయుడి రాసిన లేఖ మేరకు.. హైకోర్టు స్పందించింది. సదరు భూమి చుట్టూ ప్రహరీ నిర్మించాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు రెవెన్యూ, విద్యా, మున్సిపల్ అధికారులు హడావుడి చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

ఉపాధ్యాయుడి లేఖతో..

కమ్మగూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1725 గజాల భూమి మధ్యలో నుంచి న్యూ సుభాష్‌నగర్ వాసులు రోడ్డు వేసేందుకు ప్రయత్నించారు. తరగతి గదిని ఆనుకుని ఏర్పాటు చేసుకున్న మార్గంలో రాకపోకలు సాగించే వారు. ఈ నేపథ్యంలో సర్కారు భూమిని కాపాడాలంటూ నాటి ఉపాధ్యాయుడు భూపతి దాసు.. కింది స్థాయి అధికారి నుంచి కలెక్టర్ వరకు పలుమార్లు కలిసినా ఫలితం లేకుండా పోయింది. చివరి ప్రయత్నంగా సదరు ఉపాధ్యాయుడు.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. దీనికి స్పందించిన జస్టిస్ అలోక్ ఆరాధే, జె.అనిల్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం.. పాఠశాల స్థలం చుట్టూ ప్రహరి నిర్మించాలని 2024 జూలై 27న ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో మొదలైన ప్రహరి పనులు 80 శాతం పూర్తయి ఆగిపోయాయి.

కలెక్టర్ బదిలీతో..

హైకోర్టు ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం ఎలాంటి ఉత్తర్వులు, టెండర్లు లేకుండానే ప్రహరీ పనులు ప్రారంభించారు. అధికారుల మాటలను నమ్మిన నిర్మాణ దారుడు.. రూ.14 లక్షలు వెచ్చించి శరవేగంగా పనులు చేపట్టాడు. కానీ డబ్బులు రాకపోవడంతో మధ్యలోనే పనులు ఆపేశారు. ఇటీవల కేవలం ప్రొసీడింగ్ పత్రం ఇచ్చినట్లు తెలుస్తోంది. నిర్మాణ పనులు చేయాలని ఆదేశించిన కలెక్టర్ శశాంక.. బదిలీ కావడంతో నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. స్థానికుల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రహరి నిర్మించి, పాఠశాల స్థలాన్ని కాపాడాలని విదార్థులు, స్థానికులు కోరుతున్నారు.

> **“పనులు పూర్తి చేస్తాం”**
>
> బిల్లుల చెల్లింపు విషయంలో జాప్యం జరిగింది. అందుకే ప్రహరి పనులు నిలిచిపోయాయి. విద్యా శాఖ అధికారి సుశీందర్ రావు ప్రొసీడింగ్ కాపీ ఇచ్చారు. ఇటీవల ఈఈ, డీఈలు కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. త్వరలో నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. అనంతరం పనులు పూర్తి చేస్తాం. – సంకేత్, ఏఈ, టీజీఈడబ్ల్యూఐడీసీ

యువత క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందజేస్తున్న నాయకులు

మంచాల: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి ఆరుట్లలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి చదివి, భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని తెలిపారు. టోర్నీలో మొదటి బహుమతి రూ.20వేలు, సుంకరి జయంత్ గౌడ్ (స్పాన్సర్)శ్రీరామ్ యూత్ గెలుచుకుంది. ద్వితీయ బహుమతి రూ.15వేలు మాసయ్యగౌడ్ (స్పాన్సర్), పాండవ సేన క్లబ్ గెలుచుకుంది. తృతీయ బహుమతి రూ.10వేలు చంద్రయ్య (స్పాన్సర్)విశ్వకర్మ జట్టు గెలుచుకుంది. నాలుగో బహుమతి రూ.5వేలు సురేష్(స్పాన్సర్)యువసేన యూత్ గెలుచుకుంది. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ రూ.2,222 సురేష్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేశ్, నాయకులు బాష, అంతటిరాజు, బుగ్గరాములు, నర్సింహ, ఐలయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతానికి కృషి



సమత వేదిక ప్రారంభోత్సవంలో దాతలు, విద్యార్థులు

మాడ్గుల: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ బ్లాక్ వాయిస్ అధ్యక్షుడు శ్రీధర్ గోవింద్ అన్నారు. శనివారం మండల పరిధి అప్పారెడ్డిపల్లిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన నూతన సమత వేదికను దాత గోవింద్ ప్రారంభించి మాట్లాడారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. నాణ్యమైన విద్యకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. అనంతరం దాతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో సైదులు, జంగయ్య, వలంటీర్లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కులగణన సర్వేకు మరో అవకాశం

సద్వినియోగం చేసుకోవాలంటున్న ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో పాల్గనని వారు ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు మరోసారి నిర్వహించనున్న సర్వేలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ కుసుమమాదురి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా చేసిన కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకుని, ఫారం నింపి మండల పరిషత్ కార్యాలయం లేదా ప్రజాపాలన సేవాకేంద్రంలో నేరుగా అందజేయాలని సూచించారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: కులగణన సర్వే ఆదివారం నుంచి 28 తేదీ వరకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ వెంకటమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇంతకు ముందు కులగణన సర్వేలో పాల్గొనని వారు, ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ప్రజా పరిషత్, మున్సిపల్ కార్యాలయాలకు నేరుగా వచ్చి సర్వేలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: వివిధ కారణాలతో కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం కలెక్టర్ ఆదేశాను సారం ఫిబ్రవరి 16 నుంచి మరోసారి అవకాశం కల్పిస్తున్నామని ఎంపీడీఓ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో సర్వేకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, నేటి నుంచి ఈ నెల 28 వరకు సర్వే సిబ్బందికి వివరాలు అందజేయాలని సూచించారు.

ఆదిబట్ల పురపాలికలో..

ఇబ్రహీంపట్నం రూరల్: కులగణన సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో భాగంగా 040–2111111 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసిందని, దీనికి ఫోన్ చేసి వివరాలు నమోదు చేయించుకోవచ్చునని సూచించారు. మున్సిపల్ కార్యాలయం ప్రజాపాలన సేవా కేంద్రంలో ఫారాలు అందుబాటులో ఉంటాయని, వీటిల్లో వివరాలు నమోదు చేసుకోవచ్చునని వెల్లడించారు. ఆ ఫారాలను అధికారులకు అందజేయాలన్నారు.

మహేందర్‌కు సన్మానం



మహేందర్‌ను సన్మానిస్తున్న ఆర్.కృష్ణయ్య

ఆమనగల్లు: బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహేందర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శనివారం నగరంలో ఘనంగా సత్కరించారు. ఇందులో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, భాస్కర్, స్టూడెంట్ యూనియన్ జిల్లా కన్వీనర్ నరేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



వృక్షార్చన వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాటిన మొక్కలను పరిరక్షించాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 17న చేపట్టనున్న వృక్షార్చన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు.. ఛాలెంజ్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి శనివారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మసత్యం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, రవితేజ, అనురాధ, మాజీ ఎంపీపీలు నిర్మల శ్రీశైలం, శ్రీనివాస్ యాదవ్, జైపాల్‌నాయక్, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు రాంరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధి గడ్డమీదితండాలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిసాయి. ఈ మేరకు నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత గానుగుమార్లతండా జట్టుకు రూ.40 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పోచమ్మగడ్డతండా జట్టుకు రూ.30 వేలను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పాండు నాయక్‌లతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు పాండునాయక్, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: సేవాలాల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు



కడ్తాల్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

సేవాలాల్ సేవలు చిరస్మరణీయం

- మహరాజ్ మార్గంలో నడుచుకోవాలి
- గిరిజన సంఘాల నాయకులు
- ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



మాడ్గుల: గుడితండాలో సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజనులు

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/కడ్తాల్/మాడ్గుల: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్.. గిరిజనుల అభ్యున్నతికి, సంక్షేమానికి అనేక సేవలు చేశారని నేతలు కొనియాడారు. శనివారం కడ్తాల్ మండల కేంద్రంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు లక్పతినాయక్, సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చిత్రపటాలతో, గిరిజనులు సంప్రదాయ వేషధారణతో ఆటపాటల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. దైవ చింతనతో బంజారాలను సన్మార్గంలో నడుపుతూ.. జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన మహనీయుడు సేవాలాల్ అని, ఆయన మార్గంలో గిరిజనులు నడుచుకోవాలని సూచించారు. బంజార లిపిని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. గిరిజన పంచాయతీలను రెవెన్యూ జీపీలుగా గుర్తించాలన్నారు. అంతకు ముందు మహాభోగ్ భండార్ కార్యక్రమంలో గిరిజనులు పూజలు చేశారు. సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఎన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, నాయకులు తులసీరాం, లచ్చిరామ్‌నాయక్, శంకర్‌నాయక్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మండల పరిధి గుడితండాలో గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, తుల్జాభవానీ భోగ్‌బండార్ పూజలు నిర్వహించారు. పూజారి తారాసింగ్, మాజీ సర్పంచ్ స్వప్న, శంకర్ నాయక్, పంతు, నాయక్ ఉన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

సేవాలాల్ మహరాజ్ జయంతిని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పరమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ హీర్యానాయక్, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌నాయక్‌ను సన్మానించారు. ఇందులో రాయపోల్ హెచ్‌ఎం శ్రీనివాసులు, పీఆర్టీయూ నేతలు ఆనంద్, గోవర్ధన్, హరిప్రసాద్, శంకర్, కృష్ణ, శేషగిరి, సంపత్‌లు పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

సేవాలాల్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్‌లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ గుట్ట వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు పట్టణంలో గిరిజనులు భారీగా శోభాయాత్ర చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్‌నాయక్, గిరిజన సంఘాల నాయకులు నేనావత్ పత్యానాయక్, దశరథ్‌నాయక్, కృష్ణనాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో...

సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మల, రఘురాములు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ ఉన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ తండాలో భోగ్‌బండార్



ఇబ్రహీంపట్నంలో..



యాచారం: తక్కళ్లపల్లి తండాలో..

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- ఇంటింటికీ తాగునీరు అందించాలి
- మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, ఎంపీడీఓలు బాలశంకర్, నరేందర్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ ఆదేశించారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పుర కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్య రాకుండా హెచ్ఎండబ్ల్యూస్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. 15 వార్డుల్లో పైప్‌లైన్, గెట్‌వాల్ ఏర్పాటు చేసి.. చేతిపంపులను వినియోగంలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. బోర్లు మరమ్మతు ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న వార్డులను గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన కొత్త బోర్లు బిగించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ స్వర్ణకుమార్, మిషన్ భగీరథ డీఈఈ వినయ్‌కుమార్, హెచ్ఎండబ్ల్యూస్ మేనేజర్ నిర్మల, నీటి సరఫరా శాఖ అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై దృష్టి సారించాలి

మంచాల: గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. శనివారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి తాగు నీరు అందించే విధంగా చూడాలని సూచించారు. ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, అధికారులు, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్యలపై గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ఉపయోగ పడేలా.. గ్రామాల్లోని బోరుబావులకు మరమ్మతులు చేపట్టి, సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరాలో ఇబ్బంది కల్పిస్తే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పించే విధంగా కృషి చేయాలని ఈజీఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.